పైడిమాంబ ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు

విజయనగరం రూరల్: శ్రావణ మాసోత్సవాలకు పైడిమాంబ ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 5న శ్రావణమాసం ప్రారంభం కానుంది. 6న తొలి శ్రావణ మంగళవారం కావడంతో ఆ రోజు చదురుగుడి, వనంగుడిలో పంచామృతాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ఆ నెలలో వచ్చే ప్రతి మంగళవారం అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరుగుతాయి. భక్తులు రూ.300 చెల్లించి ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. ప్రతి శుక్రవారం విశిష్ట కుంకుమార్చన నిర్వహించనున్నారు. పౌర్ణమి రోజున స్వర్ణ పుష్పార్చన చేపడ్తారు. ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 5 వరకూ ప్రతిరోజు ఉదయం 6 గంటలకు పైడిమాంబకు చక్రర్పాన పూజ చేస్తారు.

నిషేధం అన్నారు.. వ్యాపారం చేశారు

మద్య నిషేధం అమలు చేయనున్నట్టు 2019 ఎన్నికల ముందు పాదయాత్రలో ప్రకటించిన జగన్ అధికారంలోకి వచ్చాక మద్యంతో వ్యాపారం చేశారు. ఏకంగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే దుకాణాలు ఏర్పాటు చేశారు. దశల వారీగా తగ్గిస్తామని చెప్పి పెంచుకుంటూ పోయారు. ప్రైవేటు బార్లకు డోర్లు తెరిచారు. పేరు తెలియని బ్రాండ్‌లను తీసుకొచ్చి.. నాసిరకం మద్యాన్నీ విక్రయించి.. ధరలను అమాంతం పెంచేసి మందుబాబులకు కోలుకోలేని దెబ్బకొట్టారు. తద్వారా మద్య నిషేధం ఉత్తమాటేనని తేల్చేశారు. మద్యం వ్యాపారంపై ఒక్క విజయనగరం జిల్లాలో గత ఐదేళ్లలో రూ.6,209 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ విషయాన్ని తాజాగా సీఎం చంద్రబాబు అసెంబ్లీలో శ్వేతపత్రం రూపంలో వెల్లడిస్తూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

-రాజాం

- ప్రభుత్వ మద్యం దుకాణాలతో విచ్చలవిడిగా అమ్మకాలు
- ఐదేళ్లలో జిల్లాలో రూ.6,209 కోట్ల ఆదాయం
- నాసిరకం మద్యంతో ప్రజారోగ్యంతో చెలగాటం
- కొందరు నాయకులకు కమీషన్లు
- ఐదేళ్ల వైసీపీ తీరును అసెంబ్లీలో ఎండగట్టిన సీఎం చంద్రబాబు



ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం మద్యం పాలసీ పేరుతో పేదల బతుకులతో చెలగాటమాడిన తీరును ఇటీవల సీఎం చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా బట్టబయలు చేశారు. శ్వేతపత్రం విడుదల చేస్తూ దాదాపు 30 వేల కోట్ల రూపాయల అవినీతి జరిగినట్టు అంచనా వేశారు. జిల్లాలో మద్యం ద్వారా వచ్చిన ఆదాయం అక్షరాలా రూ.6,209 కోట్లు కాగా రూ.800 కోట్ల వరకూ వైసీపీ పెద్దలకు కమీషన్ల రూపంలో అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. మద్యం ధరలు అమాంతం పెంచితే మందుబాబులు అటు చూడరంటూ కొత్త బాష్యాన్ని జగన్ చెప్పుకొచ్చారు. మద్య నిషేధానికి కొత్త నిర్వచనం ఇచ్చారు. పర్యవసానంగా ఆ ప్రభుత్వం తెచ్చిన నాసిరకం బ్రాండ్లతో ప్రజల ఆరోగ్యాన్ని దారుణంగా దెబ్బతీశారు. ఆర్థికంగా కూడా అగచాట్లు పాలు చేశారు. జిల్లా కేంద్రాస్పత్రితో పాటు ఇతర ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారిలో ఎక్కువ మంది మద్యం బాధితులుగా అక్కడి వైద్యులు చెబుతున్నారు.



తగ్గిస్తామని చెప్పి..

ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి. సీఎం జగన్ చెప్పిన మాదిరిగా తొలి ఏడాది షాపులు తగ్గించినా.. తరువాత రకరకాల పేర్లు పెట్టి షాపులను పెంచుకుంటూ పోయారు. 2019లో టీడీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయిన నాటికి జిల్లాలో ఉన్న ప్రైవేటు మద్యం దుకాణాల సంఖ్య 189. అప్పట్లో టెండరు ద్వారా లైసెన్స్ ఇచ్చి మద్యం షాపులకు అనుమతిచ్చేవారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం పాలసీనే మార్చేశారు. ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలు నడిపేందుకు నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 158 మద్యం దుకాణాలు ఏర్పాటుచేశారు. ఇందులో ఏటా 25 శాతం దుకాణాలను తగ్గిస్తామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలోని 27 మండలాల్లో 149 మద్యం దుకాణాలు, 29 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటికి 42 డిస్టలరీల ద్వారా మద్యం సరఫరా అవుతోంది.

అన్నింటా వసూళ్లు..

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సేల్స్‌మెన్లు ఇద్దరు, ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. వీరి నియామకం కోసం అధికార వైసీపీ నేతలు కాసులకు కక్కుర్తి పడ్డారు. ఎక్సైజ్ ఉన్నతాధికారులు, అధికార పార్టీ నేతలు కలిసి ఒక పోస్టుకు రూ.30 నుంచి రూ.50 వేల వరకూ వసూలు చేశారు. షాపుల అద్దెల విషయంలో సైతం వైసీపీ నేతలు భారీగా సొమ్ము వెనుకేసుకున్నారు. గ్రామాల్లో బెల్టు సరుకు పక్కదారి పట్టించడం, నకిలీ మద్యం విక్రయించడం వంటి వాటి విషయంలో కొందరు అధికారులు సిబ్బందిని సైతం తప్పుదోవ పట్టించినట్టు తెలుస్తోంది. నెల్లిమర్లలాంటి చోట్ల షాపు సిబ్బందే బెల్ట్ దుకాణాలకు మద్యం తరలిస్తుండగా పట్టుబడిన విషయం తెలిసిందే.

వేల కోట్ల ఆదాయం..

మద్యం ధరలు పెంచి ప్రభుత్వం సొమ్ము చేసుకుంది. షాక్ కొట్టించేలా ధరలు ఉంటే మందుబాబులు అటువైపు చూడడం మానేస్తారని సీఎం జగన్ ప్రకటించారు. కానీ జిల్లాలో మద్యం అమ్మకాల ద్వారా కళ్లు బైర్లు కమ్మేలా ఆదాయం రావడం గమనార్హం. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.968 కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.1147 కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.1260 కోట్లు, 2022-23లో రూ.1392 కోట్లు, 2023-24లో రూ.1442 కోట్ల ఆదాయం సమకూరింది. ఏడాదికేడాది మద్యం ఆదాయం పెరుగుతూ వచ్చింది. ఈ పరిస్థితిలో కూటమి ప్రభుత్వం రూపొందించే కొత్త మద్యం పాలసీపై మందుబాబులు ఆశలు పెట్టుకున్నారు.

సకాలంలో నగదు చెల్లింపులు

- ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తాం
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టీకరణ
- ఆండ్ర రిజర్వాయర్ నుంచి నీరు విడుదల



జలాశయం నీరు విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

మెంటాడ, ఆగస్టు 3: ఖరీఫ్ సీజన్లో ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసి వారం రోజుల్లో నగదు చెల్లింపులు చేపట్టేలా ప్రభుత్వం ఏర్పా ట్లు చేస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఆండ్ర రిజర్వాయర్ నుంచి శనివారం నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ, ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామన్నారు. తప్పుడు ప్రచారం చేసే వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ అసెంబ్లీకి ముఖం చూపలేక ఢిల్లీ వీధుల్లో ధర్నా నాటకాలకు తెరలేపినా, అక్కడ ఎవరూ పట్టించుకోక అవమానం పాలై తాడేపల్లి-బెంగళూరు ప్యాలస్‌ల మధ్య చక్కర్లు కొడుతున్నారని సంధ్యారాణి ఎద్దేవా చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సీతారాం, డీఈఈ పాండు, ఏఈ లు కృపానంద్, గోవిందరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉంటాం

- కాలనీలకు తాగునీటి సరఫరాకు చర్యలు
- విజిలెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 3: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, వారికి అండగా నిలుస్తామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి మోనటరింగ్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. గత సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలు, తీసుకున్న చర్యలను జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి బి.రామానందం తొలుత వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా చివరి పని దినం రోజును సివిల్ రైట్స్‌డేగా నిర్వహించాలని, దీని వల్ల చాలా సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఎస్సీ కాలనీలకు జలజీవన్ మిషన్ లేదా ఇతర పథకాల నుంచి తాగునీటి సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. వారికి ప్రత్యేక శ్మశాన వాటికల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఇందుకోసం అన్ని ఎస్సీ కాలనీల్లో సర్వే నిర్వహించాలన్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి అక్కడున్న సదుపాయాలు, సమస్యలపై రెండువారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అట్రాసిటీ కేసుల్లో సాక్ష్యం చెప్పడానికి వచ్చే సాక్షులకు కూడా టీఏ, డీఏలు అందజేయాలని సూచించారు. అనంతరం ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ గతేడాది అక్టోబరు 10 నుంచి ఈ ఏడాది జూన్ 30 వరకూ జిల్లాలో 66 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. చట్టపరంగా బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్వో అనిత, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



నాడు ఎంతో వైభవం నేడు దయనీయం

- శిథిలమైన పాలిటెక్నిక్ కళాశాల భవనాలు
- అవస్థల్లో విద్యార్థులు, అధ్యాపకులు
- 2016-17లో భవనాలకు రూ.9 కోట్లు మంజూరు
- గత ప్రభుత్వ తీరుతో వెనక్కి మళ్లిన నిధులు

ముప్పై అయిదు ఏళ్ల కిందట ఉన్నత ఆశయంతో ఏర్పాటైన విద్యా సంస్థ అది. రాజుల దాతృత్వంతో సొంత నీడ పొందింది. మౌలిక వసతులు, సొబగులు అద్దుకుని వేలాదిమంది విద్యార్థులకు తగిన తర్ఫీదు ఇచ్చి వారి భవితకు మార్గం చూపింది. ఇక్కడ చదువుకున్న వారంతా ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిలో కొలువుదీరారు. వారందరికీ వెలుగు చూపిన ఆ విద్యా సంస్థ మాత్రం భౌతికంగా కునారిల్లింది. నానాటికీ శిథిలమై దయనీయంగా మారిన జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల భవనాల దుస్థితిది. 2016-17లో టీడీపీ ప్రభుత్వం భవన నిర్మాణాలకు రూ.9 కోట్లు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో నిధులు వెనక్కి పోయి నేటికీ అదే స్థితిలో ఉంది.



గోడ పెచ్చులు ఊడుతూ పగుళ్లు ఏర్పడిన కార్యనిర్వాహక భవనం

(విజయనగరం టౌన్)

జిల్లా విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు 1984లో ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేసింది. ఆ తర్వాత కొన్నేళ్ల పాటు అద్దె భవనాల్లో కళాశాలను నిర్వహించారు. విజయనగరం మహారాజుల దాతృత్వంతో కళాశాలకు సొంత భవన నిర్మాణానికి సుమారు 12 ఎకరాలు సమకూరాయి. దీంతో 1990లో పూల్‌బాగ్‌లో పక్కా భవనంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు అక్కడే కళాశాల కొనసాగుతోంది. అయితే అప్పట్లో నిర్మించిన భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో అధ్యాపకులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. 2014-19 మధ్య కాలంలో నాటి టీడీపీ ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణాలకు రూ 9.7 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణం ప్రారంభించే సమయానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. భవన నిర్మాణాలకు గ్రహణం పట్టింది. మంజూరైన నిధులు వెనక్కి మళ్లిపోయాయి. పట్టు తప్పుతున్న భవనాల్లోనే అందరూ ఉండాల్సిన పరిస్థితి. కళాశాల కార్యనిర్వాహక భవనం, తరగతులు నిర్వహిస్తున్న పీవీజీ రాజు బ్లాకు, ప్రాక్టికల్స్ జరిగే మూడు భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ భవనాల్లోనే తరగతులు, కళాశాల పరిపాలన వ్యవహారాలు, ల్యాబ్‌ల నిర్వహణ చేపడుతున్నారు.

- ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నాలుగు బ్రాంచ్‌లు వున్నాయి. ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లో 66 మంది, మెటాలర్జికల్ బ్రాంచ్‌లో 66 మంది, సివిల్, మెకానిక్‌ల్లో 132 మంది చొప్పున మొత్తంగా 396 మంది విద్యార్థులు ఏటా చేరుతుంటారు. భవనాలు పాడవుతుండడంతో విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిటికీ అద్దాలు పగిలిపోవడంతో లోపలకు వర్షం నీరు వచ్చేస్తోంది. శ్లాబు నుంచి కూడా నీరు లీకై విద్యార్థులు, పుస్తకాలపై కారుతున్న పరిస్థితి.
- 1990లో నిర్మించిన కార్యాలయ భవనం పూర్తిగా పోయింది. ప్రిన్సిపాల్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంటు, అధ్యాపకుల గదులతో పాటు ల్యాబ్‌ల నిర్వహణ అందులోనే చేపడుతున్నారు. గోడలు, శ్లాబు పగిలిపోవడంతో పాటు పెచ్చులూడి మీద పడుతున్నాయని అధ్యాపకులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- 400 మంది విద్యార్థులున్న కళాశాలకు మరుగుదొడ్ల కరువు. దీంతో వారంతా ఆరు బయటకు వెళ్తున్నారు.
- పదెకరాలు విస్తీర్ణంలో వున్న కళాశాల ప్రాంగణంలో సుమారు నాలుగు ఎకరాలు క్రీడా మైదానానికి కేటాయించారు. అయితే ఈ క్రీడా మైదానాన్ని బయట వ్యక్తులే ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. వారిని కట్టడి చేయడం లేదు.
- కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో సమీప ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు ఈ భవనాలను ఉపయోగించుకుంటున్నారు.



ఏ క్షణమైనా కూలేలా మరుగుదొడ్ల గది

భవనాలు లేక అవస్థలు

జె.ఆశారమణి, ప్రిన్సిపాల్, పాలిటెక్నిక్ కళాశాల

1990-95 మధ్య కాలం నాటి కళాశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. తరగతుల నిర్వహణ, కళాశాల కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 2016-17 మధ్య కాలంలో నిధులు మంజూరైనా సకాలంలో పనులు చేపట్టక నిధులు వెనక్కి మళ్లిపోయాయి. వర్షాలకు గోడలు, శ్లాబు లీకై కూలిపోయే పరిస్థితి నెలకొంది. గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి మరమ్మతులకు సైతం నిధులు రాలేదు.



ఇక్కడో కాలువ ఉండాలి!

పేదల డిపట్టా భూములను చౌకగా చేజిక్కించుకోవడం.. చెరువులను కబ్జాచేసి నచ్చిన వ్యక్తులకు చేపల పెంపకానికి అప్పగించడం.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేయడం ఆ పంచాయతీలో సర్వసాధారణం. ఐదేళ్ల అడ్డదారి దందాను ఇంకా కొనసాగిస్తున్నారు. తాజాగా కాలువపై కన్నేశారు. దురాలోచన తట్టిందే తడవుగా పనులకు ఉపక్రమించారు. రోజుల వ్యవధిలోనే పూర్తిగా కాలువను లేకుండా చేశారు. ఇన్ని ఆక్రమాలకు కేంద్రంగా నిలిచిన ఆ పంచాయతీ పేరు ముషిడిపల్లి. ఈ అన్యాయాల్ని చూస్తున్న స్థానికులు బడాబాబులకు భయపడి మిన్నకుండి పోతున్నారు. కొండల నుంచి నీరు వచ్చే కాలువను మూసేయడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంచాయతీ స్థలాలు తాటిపూడి-విజయనగరం హైవేకు ఆనుకుని ఉండడంతో కొందరు వ్యక్తులు ఇదే పనిగా భూముల చుట్టూ తిరుగుతున్నారు. కొండకాలువ మూసేయడంపై తహసీల్దార్ అరుణకుమారిని వివరణ కోరగా ఆర్ఐను పంపి విచారిస్తామన్నారు.

- శృంగవరపుకోట రూరల్

డీసీసీబీ విభజన

- పార్వతీపురం మన్యానికి మరో కేంద్రం
- బ్రాంచ్‌లు, పీఏసీఎస్‌లు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు

(విజయనగరం రూరల్)

ఆంధ్రప్రదేశ్‌లో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించిన నేపథ్యంలో.. 13 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను కూడా 26 డీసీసీబీ (జిల్లా కేంద్ర సహకార బ్యాంకు)లుగా విభజించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజాగా అమరావతిలో జరిగిన డీసీసీబీ సీఈఓల సమావేశంలో ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. ఈ సమావేశానికి విజయనగరం డీసీసీబీ సీఈఓ సీహెచ్ ఉమామహేశ్వరరావు కూడా హాజరయ్యారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు 14 బ్రాంచ్‌లు, 95 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్)లు వున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించినా.. డీసీసీబీ మాత్రం ఉమ్మడిగా కొనసాగుతోంది. తాజాగా ప్రభుత్వం విభజించాలని నిర్ణయం తీసుకుంది.. ఈ బ్రాంచ్‌లను, 95 పీఏసీఎస్‌లను కూడా జిల్లాల వారీగా విభజించనున్నారు. ఈ ఏడాది డిసెంబరులోగా విభజన ప్రక్రియను పూర్తి చేయాలన్నది లక్ష్యం. వాస్తవానికి ఇదివరకే డీసీసీబీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. ఈ నేపథ్యంలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది.. విజయనగరం డీసీసీబీకి పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ వ్యవహరిస్తున్నారు. జూన్ నుంచి పర్సన్ ఇన్‌చార్జులే బాధ్యతలు చూస్తున్నారు. డిసెంబరు వరకూ వీరు కొనసాగనున్నారు. డిసెంబరులోగా విభజన ప్రక్రియ పూర్తి చేసి పీఏసీఎస్, డీసీసీబీలకు ఎన్నికలు నిర్వహించాలా? లేక నామినేటెడ్ పద్ధతుల్లో సభ్యులను నియమించాలా అన్నది ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

ఆంధ్ర యూనివర్సిటీలో డిస్టెన్స్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లు



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు: బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ) ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు: ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్‌ఆర్ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

జేఎన్‌టీయూకేలో స్పాన్సర్డ్ ఎంటెక్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కాకినాడ, నర్సరావుపేట క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. అకడమిక్ మెరిట్, గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్పెషలైజేషన్‌కు అయిదు సీట్లు చొప్పున మొత్తం 125 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్, బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ.

అర్హత: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ పూర్తిచేసి ఉండాలి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ/మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/ఎర్త్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులు; ఎంబీబీఎస్/బీడీఎస్/బీ ఫార్మసీ/బీవీఎస్సీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 అర్హత తప్పనిసరి. అభ్యర్థులకు కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **సెమిస్టర్ ఫీజు:** రూ.25,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

దిక్సూచి DIKSUCHI

బయోటెక్నాలజీ, సైన్సెస్ విభాగాల్లో పీజీ చేయాలనుకొనే వారి కోసం ఉద్దేశించిన 'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్) 2025' షెడ్యూల్ వెలువడింది. దీనిని ఈ ఏడాది ఐఐటీ ఢిల్లీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారా ఎమ్మెస్సీ; ఎమ్మెస్సీ(టెక్); ఎంఎస్(రీసెర్చ్); జాయింట్/డ్యూయల్ డిగ్రీ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ; ఎమ్మెస్సీ-ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ; ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 21 ఐఐటీలు అందిస్తున్న వివిధ పీజీ ప్రోగ్రామ్‌లలో సుమారు 3000 సీట్లను జామ్ స్కోర్ ద్వారా నేరుగా భర్తీ చేస్తారు. అలాగే నిట్ సంస్థలు, ఐసర్లు, ఐఐఎస్సీ, ఐఐఈఎస్‌టీ, డీఐఏటీ, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్ఆర్, ఎస్ఎల్ఐఈఈటీ సహా ప్రముఖ సీఎఫ్‌టీఐ సంస్థల్లో 2300కు పైగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఈ స్కోరునే ప్రామాణికంగా తీసుకుంటారు.

సైన్స్ పీజీల్లో ప్రవేశానికి జామ్

జామ్ పేపర్లు: జామ్ ఎగ్జామ్‌ను ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్‌లో కెమిస్ట్రీ, జియాలజీ, మేథమెటిక్స్ పేపర్లు; మధ్యాహ్నం సెషన్‌లో బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు పేపర్లు రాయవచ్చు. రెండు పేపర్లు రాసేవారు ఉదయం సెషన్ నుంచి ఒక పేపర్, మధ్యాహ్నం సెషన్ నుంచి మరో పేపర్ ఉండేలా చూసుకోవాలి. పేపర్లకు నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కెమిస్ట్రీ పేపర్ సిలబస్ మారినందున దానిని త్వరలోనే అప్‌లోడ్ చేస్తారు.

అర్హత: అభ్యర్థి జామ్‌లో ఎంచుకొన్న పేపర్/పేపర్లను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; సంబంధిత ఇండియన్ డిగ్రీ పూర్తిచేసిన విదేశీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా జామ్ ఎగ్జామ్ రాయవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 3
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 11
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 జనవరిలో
- **జామ్ 2025 ఎగ్జామ్ తేదీ:** 2025 ఫిబ్రవరి 2
- **వెబ్‌సైట్:** jam2025.iitd.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gudU4Skలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



యుద్ధానికి సిద్ధం

అడివిశేష్ హీరోగా నటించిన 'గూఢచారి' సినిమాకి కొనసాగింపుగా వస్తోన్న చిత్రం 'గూఢచారి 2'. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. 'గూఢచారి' చిత్రం విడుదలై ఆరేళ్లు అవుతున్న సందర్భంగా పార్ట్ 2 నుంచి ఆరు స్టైలిష్ యాక్షన్ స్టిల్స్‌ను శనివారం యూనిట్ విడుదల చేసింది. 'గూఢచారి 2' భారీ స్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కుతోంది' అని శేష్ చెప్పారు. ఇప్పటికి 40 శాతం షూటింగ్ పూర్తయిందని నిర్మాతలు తెలిపారు.



రెడ్‌కార్పెట్ లుక్

'69వ శోభా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024' వేడుక శనివారం రాత్రి హైదరాబాద్‌లో అట్టహాసంగా జరిగింది. హీరోలు నాని, సుధీర్‌బాబు, సందీప్ కిషన్, అల్లు శిరీష్, నవీన్ పొలిశెట్టి, సిద్ధార్థ్... హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, ఐశ్వర్యా రాజేశ్, జ్యోతిక, నభానటేశ్, రాశీఖన్నా, ప్రియమణి తదితరులు పాల్గొన్నారు.

లావణ్యే డ్రగ్స్ అలవాటు చేసింది

● రాజ్‌తరుణ్ మాజీ ప్రియురాలిపై కేసు

రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య మధ్య నడుస్తున్న వివాదం కొత్త మలుపు తీసుకుంది.



లావణ్య తనకు డ్రగ్స్ అలవాటు చేసిందంటూ ప్రీతీ అనే యువతి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. 'లావణ్య ఇప్పటికే చాలామంది అమ్మాయిలకు డ్రగ్స్ అలవాటు చేసింది, తరచూ నాకు ఫోన్‌చేసి బెదిరిస్తోంది, ఆమెవల్ల ఇప్పటికే చాలా జీవితాలు నాశనం అయ్యాయి' అని ప్రీతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సుఖేందర్‌రెడ్డి తెలిపారు. డ్రగ్స్ విషయంలో అడ్డు చెప్పడం వల్లే ఆమె రాజ్‌తరుణ్‌పై కక్ష పెంచుకుందని ఆయన తరఫు లాయర్ మధుశర్మ చెప్పారు.

వయనాడ్ విలయం... సినీతారల సాయం



కేరళ సీఎం సహాయక నిధికి రూ. 25 లక్షల సాయం అందించిన మలయాళ నటుడు మోహన్‌లాల్ సహాయక చర్యల్లో సైతం పాల్గొని తన గొప్ప మనసు చాటుకున్నారు. టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా కొనసాగుతున్న ఆయన ఆ హోదాలో దగ్గరుండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. వయనాడ్‌లోని ఆర్మీ బేస్ క్యాంప్‌లో ఆయన సైనికులను కలిశారు. తాత్కాలిక బ్రిడ్జిల నిర్మాణం లాంటి కార్యక్రమాల్లో సైనికులతో కలసి పాల్గొన్నారు. 'మీరు రీల్ హీరో కాదు రియల్ హీరో' అంటూ నెటిజన్లు మోహన్‌లాల్‌ను ప్రశంసిస్తున్నారు.

నటీనటుల విరాళాలు



భారీ వరదలు, కొండ చరియలు విరిగిపడి తీవ్రంగా నష్టపోయిన వయనాడ్ ప్రాంతంలో సహాయ, పునరావాస కార్యక్రమాలకు తమవంతు సాయం అందించేందుకు తారాలోకం నడుంకట్టింది. పలువురు నటీనటులు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు ఇస్తున్నారు. టాలీవుడ్ కథానాయిక రష్మిక మందన్న రూ. 10 లక్షలు, నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ. 5 లక్షలు విరాళంగా ఇచ్చారు. తమిళ నటులు సూర్య, కార్తి, జ్యోతిక కలిసి రూ. 50 లక్షలు ఇవ్వగా, కమల్‌హాసన్ రూ. 25 లక్షలు, విక్రమ్ రూ. 20 లక్షలు ఇచ్చారు. దుల్కర్ సల్మాన్ రూ. 10 లక్షలు, మమ్ముట్టి రూ. 15 లక్షలు, ఫహద్‌ఫాజిల్, నజ్రియా దంపతులు రూ. 25 లక్షలు విరాళంగా అందించారు.



సక్సెస్



థియేటర్లు పెరుగుతున్నాయి

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా రూపొందిన 'తిరగబడరా సామీ' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవంలో నిర్మాత మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ 'మొత్తం 200 థియేటర్లలో విడుదల చేశాం. ఈ రోజు మరో 20 థియేటర్లు పెరిగాయి. మా సినిమాకు మంచి రిపోర్ట్ వచ్చింది. దర్శకుడు రవికుమార్ చౌదరి అద్భుతంగా తీశారు. లేడీ విలన్‌గా మన్నారా చోప్రా చక్కగా నటించింది' అన్నారు. మంచి సినిమాను ఏదీ అడ్డుకోలేదని ప్రేక్షకులు నిరూపించారని దర్శకుడు రవికుమార్ చౌదరి చెప్పారు.

ప్రేక్షక దేవుళ్లు కరుణించారు



'ఒక కొత్త హీరో నటించిన సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. 'ప్రేక్షక దేవుళ్లు' అని ఎందుకు అంటారో నాకు ఇప్పుడు అర్థమైంది' అన్నారు 'అలనాటి రామచంద్రుడు' చిత్ర హీరో కృష్ణవంశీ. శుక్రవారం విడుదలైన ఈ చిత్రానికి మంచి ఆదరణ లభించిందని శనివారం నిర్వహించిన థాంక్స్ మీట్‌లో వెల్లడించారు. ఈ చిత్ర నిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్మాత శ్రీరామ్ జడపోలు కృతజ్ఞతలు తెలిపారు.



రెస్పాన్స్ బాగుంది

'చాలా రోజుల తర్వాత ఒక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను చూశామని ప్రేక్షకులు అంటుంటే ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు విజయ్‌భాస్కర్. శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష జంటగా రూపొందిన 'ఉషా పరిణయం' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో చిత్రనిర్మాత, దర్శకుడు విజయభాస్కర్ మాట్లాడుతూ 'కలెక్షన్లు నెమ్మదిగా పెరుగుతున్నాయి. రెస్పాన్స్ బాగుంది. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరిస్తే మరిన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు వస్తాయి' అన్నారు





నేడు అమరావతికి కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్: రాష్ట్ర అమరావతి సచివాలయంలో ఈనెల 5,6 తేదీల్లో జరగనున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొనేందుకు జిల్లా కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆదివారం అమరావతికి బయలుదేరి వెళ్లనున్నారు. ఈ సదస్సు ద్వారా రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలకు సమర్థవంతమైన పాలన, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తూ ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించనున్నారు. 6న కలెక్టర్లు, ఎస్పీలతో సంయుక్త సమావేశం నిర్వహించనున్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి మానుకోవాలి

విజయనగరం రూరల్: పాఠశాలల సందర్శన సమయంలో డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో పాఠ్య ప్రణాళికలు డైరీల్లో రాయాలని ఉపాధ్యాయులను భయపెట్టడం, మానసిక ఒత్తిడికి గురి చేయడం సరికాదని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు అన్నారు. శనివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పని సర్దుబాటు విషయంలో రాష్ట్ర డైరెక్టర్ ఇచ్చిన నిబంధనల మేరకు మండల పరిధిలోని సర్దుబాటు చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉపాధ్యాయుల సర్వీసు పనులు జాప్యం నివారించి సత్వరమే పరిష్కరించాలని కోరారు. సంఘ ప్రతినిధులు సూరిబాబు, గోవిందరావు, మోహనరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ శుభపరిణామం

రాజాం: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పరిష్కారం లభించడం శుభపరిణామమని ఏబీవీపీ రాష్ట్ర మాజీ కార్యవర్గసభ్యులు అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం నిర్వహించిన అంబేడ్కర్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనుల పరిశీలన

రింగురోడ్డు: నగరంలోని గంటస్థంబం ప్రాంతంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం. నాయుడు పరిశీలించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికత తీత ప్రక్రియలో సాంకేతిక సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలరోజులుగా అన్ని కాలువల్లో పూడికతీత పనులను ముమ్మరం చేశామన్నారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు. ● ఇంటి ఆవరణ ప్రాంతాల్లో నీరు నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని కమిషనర్ నాయుడు అన్నారు. శనివారం బొండాడ, చిన్నవీధి, ఉసిరకల సత్రం జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. వారంలో ఒకసారి డ్రైడే పాటించాలన్నారు.

కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలి

బాడంగి: వరినాట్లు తరువాత కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్ సూచించారు. శనివారం మండలంలోని రేజేరు గ్రామంలో రైతులకు పలు సూచనలు చేశారు. వరినాట్లు వేసిన 3 రోజుల్లోపు ప్రీఎమర్జెన్సీ కలుపు నాశనిని పొలం మొత్తం సమానంగా వెదజల్లాలన్నారు. వ్యవసాయ సిబ్బంది సిఫారసు మేరకు కలుపు మందులు వినియోగించాలని, మందులు చల్లేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట పలువురు రైతులు పాల్గొన్నారు.

ఐటీఐలో చేరేందుకు మూడో విడత నోటిఫికేషన్

బొబ్బిలి: బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు మూడో విడత ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు తెలిపారు. ఎస్ఎస్‌సీ పాసైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 26 లోగా రిజిస్ట్రేషన్ చేసుకుని యూనిక్ నెంబర్ పొందాలని ఆయన సూచించారు. ఒకసారి అడ్మిషన్ పొందిన వారు అదే మొబైల్ నెంబరు నుంచి మాత్రమే స్కిల్ ఇండియా డిజిటల్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విజయనగరం, బొబ్బిలి, రాజాం ఐటీఐలలో ఎక్కడైనా ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 29న బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించబోయే కౌన్సిలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ రమణారావు తెలిపారు.

రక్తదాన ఆవశ్యకతను గుర్తించాలి

విజయనగరం క్రైం: రక్తదాన ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు అన్నారు. శనివారం నగరంలోని గాయిత్రీ ఆసుపత్రి, కంచెర్ల నగర పాలక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కొట్నా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆనందబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సామాజిక బాధ్యతగా రక్తదాన ఆవశ్యకతను తెలుసుకుని వేసవిలో సుమారు 320 యూనిట్లు రెడ్‌క్రాస్ సొసైటీకి అందించారన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు ప్రాణదాతగా నిలిచిన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డాక్టరు జీబీ వెంకట్, ఎం రాము, ఆర్ఐ శంకరరావు, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్‌తోపాటు సుధాకర్, రెడ్‌క్రాస్ సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌తో సాగునీటి ఆదా

రాజాం: డ్రిప్ ఇరిగేషన్ వినియోగం వల్ల సాగునీటి ఆదాతో పాటు భూగర్భ వనరుల పొదుపు సాధ్యమవుతుందని ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. మండల పరిధిలోని బొద్దాంలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగుచేస్తున్న వ్యవసాయ కమతాలను శనివారం ఆయన పరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతి పరిశీలించండి

బాడంగి: ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించాలని హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ కోరారు. శనివారం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు ఏయే స్థాయిలో ఉన్నవి పరిశీలించాలన్నారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ

బొబ్బిలి: కేరళలోని వయనాడ్ ప్రాంతంలో సంభవించిన ఘోరవిపత్తులో నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో శనివారం బొబ్బిలిలో విరాళాలు సేకరించారు. సీపీఎం నాయకులు శంకరరావు, గోపాలం తదితరులు ఇంటింటికీ వెళ్లి విరాళాలను సేకరించారు. సీఐటీయూ నాయకులు గౌరీశ్, వెంకట్, ఎస్ఎఫ్ఐ నాయకుడు మణికుమార్, కిరణ్, బి.లక్ష్మీదాసు తదితరులు పాల్గొన్నారు.

మోసూరు పాఠశాల తనిఖీ

బొబ్బిలి రూరల్: మోసూరువలస ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో రవికుమార్ శనివారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి కలాం తదితరులు పాల్గొన్నారు.

మరణించిన పోలీసు కుటుంబాలకు చేయూత

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 3: జిల్లా పోలీసుశాఖలో విధులు నిర్వహించి ఇటీవల కాలంలో మరణించిన కానిస్టేబుల్స్, హోంగార్డుల కుటుంబాలకు చేయూతను అందించేందుకు సిబ్బంది సేకరించిన ఒక్క రోజు అలెవెన్సును కుటుంబ సభ్యులకు ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. హోంగార్డులుగా పనిచేస్తూ వెంకట సత్యం కుటుంబానికి 3 లక్షల 26 వేల 600 రూపాయల చెక్కును ఆయన సతీమణి పార్వతికి అందజేశారు. అలాగే, కానిస్టేబుల్‌గా పనిచేస్తూ, అనారోగ్య కారణాలతో మరణించిన టీ గౌరీకుమార్ కుటుంబానికి చేయూతగా పోలీసు ఉద్యోగులు సేకరించిన లక్షా 48 వేల 900 రూపాయల చెక్కును ఆయన సతీమణి ఇందిరా వసంతకి అందజేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం హోంగార్డు ఉద్యోగుల పిల్లలకు మంజూరు చేసిన మెరిట్ స్కాలర్‌షిప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, పోలీసుశాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు ఆకస్మికంగా లేదా అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ అందేంత వరకూ వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు సిబ్బంది ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరిడెంటెంట్ ప్రభా కరరావు, ఆర్ఐ రమేష్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

‘పట్టాలు ఇచ్చి స్థలం అప్పజెప్పలేదు’

రేగిడి: రేగిడి గ్రామానికి చెందిన 18 ఎస్టీ కుటుంబాలకు ఉంగరాడమెట్ట వద్ద హౌస్‌సైట్‌లకు పట్టాలు జారీ చేసి స్థలం అప్పజెప్పకపోవటంపై రేగిడి గ్రామానికి చెందిన నందివాడ గంగన్నదొర, మిగిత ఎస్టీ కుటుంబాలకు చెందిన వ్యక్తులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేశారు. 2008లో అప్పటి ప్రభుత్వం తమకు గుళ్లపాడు బౌండరీలో సెంటుస్థలం కేటాయించిందని, ఏళ్లు గడుస్తున్నా స్థలం అప్పజెప్పలేదని, దీనిపై రెవెన్యూ అధికార్ల చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగటం లేదని వాపోయారు. దీనిపై తహసీల్దార్ ఎల్లరావుకు వీరింతా మోమెరాండం సమర్పించారు. దీనిపై ఆర్ఐ విచారణకు పంపించి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వటంతో వీరు వెనతిరుగారు. ఈ నిరసనలో ఎస్టీ కుటుంబాలకు చెందిన బి రామన్నదొర, సాయి, బి అప్పమ్మ, గౌరి పాల్గొనగా, వీరికి జనసైనికులు లావేటి గౌతం, రేగిడి యువత మద్దతు తెలిపారు.


రేగిడి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

వైభవంగా సీతారాముల కల్యాణం

రింగురోడ్డు: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామానారాయణం ప్రాంగణంలో శనివారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించు కుని, దేవాలయ అర్చకులు చాణక్య శ్రీ హర్ష, తేజ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ సీతారాములకు పంచామృతాభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం కన్నుల పండవగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎన్.సీ.ఎస్ నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు భక్తులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పుస్తకాలు పంపిణీ చేసిన బేబీనాయన

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎమ్మెల్యే బేబీనాయన శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేపట్టారన్నారు. అనంతరం జీఎంసీ బాలయోగి గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ప్రిన్సిపాల్ రామదాసుతో పాఠశాలలో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురుకుల పాఠశాల ఆవరణలో పండ్లు, పూల మొక్కలను నాటారు. మండల పార్టీ అధ్య క్షుడు తెంటు రవిబాబు, సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ దేవరపల్లి శ్రీనివాస రావు, జడ్పీటీసీ రామారావు, రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్నబేబీనాయన

రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలు ప్రారంభం

విజయనగరం టౌన్: విజయనగరం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అండర్-7 ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లా కేంద్రంలోని గురజాడ పాఠశాలలో డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలు అందజేయడం జరుగుతుందని చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ భీమారావు, ట్రెజరర్ కెఎల్ జ్వాలాముఖి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి మస్తాన్‌బాబులు తెలిపారు. కార్యక్రమంలో గురజాడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బూడి శేఖర్, చెస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో కొత్తగా 39 లెప్రసీ కేసులు

విజయనగరం రింగురోడ్డు: జిల్లాలో కొత్తగా 39 లెప్రసీ (కుష్టు) వ్యాధి కేసులు నమోదైనట్టు డీఎంహెచ్‌వో భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 18 నుంచి 15 రోజుల పాటు ఇంటింటా కుష్టువ్యాధిపై సర్వే కార్యక్రమాన్ని నిర్వహించగా వీరిలో అనుమానాస్పద కేసులుగా 2,519 మందిని గుర్తించామన్నారు. మిగిలిన వారికి కూడా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా స్పర్శలేని మచ్చలు, కాళ్లు లేదా చేతులు కండరాల బలహీనతల లక్షణాలు కన్పిస్తే, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు.

● కుష్టువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని చెల్లూరు లెప్రసీ మిషన్, హీల్ ప్రాజెక్టు ప్రతినిధి డాక్టరు తాలాడ దీప్తి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కుష్టువ్యాధి ఇంటింటి సర్వే ముగింపు కార్యక్రమంలో భాగంగా చెల్లూరులోని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు.

వీణల తయారీ కళాకారులకు వర్క్‌షాప్

బొబ్బిలి, ఆగస్టు 3: స్థానిక గొల్లపల్లి వీణల తయారీ కేంద్రంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వీణల తయారీ కళాకారులకు డిజైన్ అండ్ టెక్నికల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపును శనివారం ప్రారంభించారు. బొబ్బిలి, వాడాడ గ్రామాలకు చెందిన 20 మంది వీణల తయారీదారులకు నైపుణ్యాలను పెంచుకునేందుకు అక్టోబరు 1 వరకు ఈ వర్క్ షాపు నిర్వహిస్తారు. విశాఖకు చెందిన లేపాక్షి కార్యనిర్వహణాధికారి ఆనపు కార్తీక్ ఈ వర్క్‌షాపును ప్రారంభించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రాజాం రూరల్, ఆగస్టు 3: మత్తు మనిషిని చిత్తు చేస్తుందని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడం ద్వారా ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చని మండల న్యాయసేవాధి కార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. మాదకద్ర వ్యాల దుర్విని యోగం, నిర్మూలన, వికలాంగులకు చట్టపరమైన సేవలు, తదితర అంశాలను వివరించారు. జూనియర్ న్యాయాధికారి కృష్ణ సాయితేజ మాట్లాడుతూ పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ కనబరచాలని సూచించారు. వారి ప్రవర్తన నడవడికపై దృష్టిని కేంద్రీకరించాలని హితవు పలికారు. మానసిక రుగ్మతలు-చికిత్సా విధానం పై డా.ఆదర్శ్ వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు రామినాయుడు, సెబ్ ఎస్.ఐ. చంద్రశేఖర్ రావు, సంతకవిటి ఎస్.ఐ. షేక్ శంకర్, కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి

కోరుకొండ సైనిక స్కూల్‌లో ఇన్వెస్టిచర్ కార్యక్రమం

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక స్కూల్‌లోని డాక్టరు పీవీజీ రాజు ఆడిటోరియంలో శనివారం ఇన్వెస్టిచర్ వేడుక వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా క్యాడెట్‌లకు ర్యాంకులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ ప్రిన్సిపాల్ గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ స్కూల్ క్రమశిక్షణ, విలువలను నిలబెట్టేందుకు ప్రతి క్యాడెట్ అంకితభావంతో కృషి చేయాలన్నారు. అనంతరం ప్రతిష్టాత్మకమైన స్కూల్ వార్షిక ట్రోఫీలను అందజేశారు. గజపతి హౌస్ చాంపియన్ ఆఫ్ చాంపియన్ హౌస్, ఆకడమిక్, డిసిప్లేన్ ట్రోఫీలను అందుకుంది.

సుప్రీం కోర్టు తీర్పు నిలిపివేయాలి

శృంగవరపుకోట రూరల్: ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు నిలిపివేయాలని జిల్లా దళిత సంఘ నాయకులు తెరపల్లి కోటరావు, గుర్రపు శ్రీనువాసరావు కోరారు. శనివారం కొట్టాం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వీరు మాట్లాడారు. ఈ తీర్పుతో తమ ఐక్యత దెబ్బ తింటుందన్నారు.

మధ్యాహ్న భోజన బియ్యం పరిశీలన

శృంగవరపుకోట రూరల్: సంతగైరమ్మపేట ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి వినియోగించే బియ్యాన్ని పౌర సరఫరాల డీటీ శ్రీనువాసరావు శనివారం పరిశీలించారు. భోజనంలో నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కొత్తవలస: కొత్తవలస-విజయనగరం రోడ్డులోనున్న శ్రీనివాస ఫంక్షన్ హాలులో సుబ్బలక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ట్రస్టు ఛైర్మన్ కనకాల శివ తెలిపారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు వారు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

కేజీబీవీకి డిజిటల్ లైబ్రరీ వితరణ

లక్కవరపుకోట: మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలకు సాహసం స్వచ్ఛంద సంస్థ రూ.1.5లక్షల విలువైన డిజిటల్ లైబ్రరీని శనివారం అందించింది. సంస్థ అధినేత మాచవరపు గణేష్, వేంకటేశ్వర ఇన్‌ఫ్రా అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈశ్వరరావు, శ్రీదేవి, ప్రిన్సిపాల్ బి.ప్రవీణ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో సదస్సులు

బొబ్బిలి రూరల్: ఎరకందొరవలస, మోసూరువలస, డొంగురువలస గ్రామాల్లో శనివారం న్యాయ అవగాహన సదస్సులు, వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిరిడి పీహెచ్‌సీ డాక్టర్ భరద్వాజ ఆధ్వర్యంలో ప్రజలకు సేవలందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా పుస్తకాల పంపిణీ

బొబ్బిలి రూరల్: ఎం.పనుకువలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయ సంఘం నేత కె.విజయగౌరి శనివారం ఉచితంగా పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు

లక్కవరపుకోట: తామరాపల్లి రెవెన్యూలో సర్వే నెంబరు 3,11,12,13లలో గల గెడ్డను ఆక్రమించి సాగుకు ప్రయత్నాలు చేస్తున్న భూముల్లో హెచ్చరిక బోర్డులు పాతారు. శనివారం రెవెన్యూ సిబ్బందిని పంపించి సంబంధిత భూముల్లో బోర్డులు పాతామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. గెడ్డను ఆక్రమించిన వారిపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులకు అవగాహన

శృంగవరపుకోట రూరల్: వరి రైతులు నారు చివర్లు తుంచి నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను మండల వ్యవసాయాధికారి రవీంద్ర వివరించారు. శనివారం వసి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమం లో ఎలా నాటాలో చూపించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వీఏఏలు రవి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.


ఎలా ఉడుపుచేయాలో వివరిస్తున్న ఏవో రవీంద్ర

స్నేహమే శాశ్వతం..

విజయనగరం (ఆంధ్రజ్యోతి)

ఆ ముగ్గురి స్నేహం ఈ నాటిది కాదు. ప్రాంతాలు, కులాలు, మతాలు వేరైనా వారి అనుబంధం మరింత బలపడింది. స్నేహం శాశ్వతం అన్న నానుడిని వారు నిజం చేస్తున్నారు. వారిలో ఒకరు శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం వీఎస్ పురానికి చెందిన హిందువు, ప్రస్తుతం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కాగా రాయలసీమ ప్రాంతం కదిరి సమీపంలోని గార్లపెంట గ్రామానికి చెందిన ముస్లిం మతస్థుడు సుభాన్ ఒకరు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని పెడనకు చెందిన క్రిస్టియన్ తరపట్ల శ్యామ్ ప్రసాద్ మరొకరు. ఈ ముగ్గురికీ 1994లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మూడు దశాబ్దాలుగా అదే ఆత్మీయతతో ఉన్నారు. ప్రతిష్టాత్మకమైన అయోధ్య రామమందిర నిర్మాణానికి ఈ ముగ్గురు స్నేహితులూ కలిసి గత ఏడాది బ్యాంకు డీడీల ద్వారా ఆర్థిక సాయం పంపించారు. అలాగే ఉమ్మడిగా పలు ఉచిత వైద్యశిబిరాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్నేహి తుల దినోత్సవం రోజు అయిన ఈ నెల 4న ఈ ముగ్గురు ప్రత్యేకంగా కలిసేందుకు నిర్ణయించుకున్నారు.


స్నేహితులతో ఎంపీ కలిశెట్టి

చికిత్స పొందుతున్న విద్యార్థులు క్షేమం

శృంగవరపుకోట రూరల్, ఆగస్టు 3: మండలంలోని గిరిశిఖర గ్రామం చిట్టంపాడుకు చెందిన 23 మంది విద్యార్థులు డయేరియా బారిన పడి చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే వీరిలో ఇద్దరు విద్యార్థినులు సన్యాసమ్మ, నవ్య పరిస్థితి విషమించడంతో వారిని విశాఖ కేజీహెచ్‌కు మూడురోజుల క్రితం తరలించారు. అయితే అక్కడ పిల్లల ఆరోగ్య పరిస్థితి సమీక్షిస్తున్న డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఇద్దరు పిల్లల పరిస్థితి మెరుగుపడిందన్నారు. వీరిలో నవ్యకు డయాలసిస్ జరిగిన తరువాత ఆరోగ్యం కుదుటపడిందని, డయేరియా బారిన పడ్డ మొత్తం విద్యార్థుల ఆరోగ్యం బాగుందని తెలిపారు.


కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్న నవ్య వద్ద వైద్యాధికారి శిరీష

నవదుర్గ ఆలయ ఈవోపై విచారణ


రికార్డులను పరిశీలిస్తున్న ఉప కమిషనర్

రాజాం రూరల్, ఆగస్టు 3: రాజాంలోని నవదుర్గ అమ్మవారి దేవస్థానం, వంగర మండలం సంగమేశ్వర ఆలయాల ఈవో కేశవరావు పనితీరు, వ్యవహార శైలిపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు శనివారం దర్యాప్తు నిర్వహించారు. దేవదాయశాఖ ఉప కమిషనర్ సుజాత, జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో రాజాంలోని ఆలయంలో సమావేశమయ్యారు. రెండు ఆలయాలకు సంబంధించిన ఖర్చుల వివరాలతో పాటు అర్చకులు, సిబ్బందికి కొన్ని నెలలుగా వేతనాల అందజేతలో చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలపై దర్యాప్తు చేపట్టారు. నవదుర్గ అమ్మవారి దేవస్థానం ఛైర్మన్ నరిశింగరావుతో పాటు సిబ్బంది నుంచి వివరాలను సేకరించారు. జీతాల చెల్లింపులో జాప్యంతో పాటు అవకతవకలున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిస్తామని సుజాత స్పష్టం చేశారు. ఈవో కేశవరావు శైలిపై ఉన్నతాధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

ఎస్.కోట బీసీ కళాశాల బాలుర వసతిగృహం తనిఖీ

శృంగవరపుకోట, ఆగస్టు 3: శృంగవరపుకోట బీసీ కళాశాల బాలుర వసతి గృహాన్ని శనివారం సాయంత్రం జిల్లా సంక్షేమ అధికారి కె.సందీప్ తనిఖీ చేశారు. వంట గదులను, రికార్డులను పరిశీలించారు. భోజనం రుచి చూసారు. విద్యార్థులతోను సమావేశమయ్యారు. వసతి గృహ సంక్షేమ అధికారి సత్యనారాయణ వున్నారు.


వసతి గృహ విద్యార్థులతో మాట్లాడుతున్న సందీప్

వాడీవేడిగా రేగిడి మండల సమావేశం

రేగిడి: రేగిడి మండల సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా సాగింది. గ్రామ స్థాయి సమస్యలు, ప్రొటోకాల్ ఉల్లంఘన, అధికారుల తప్పిదాలపై అభియోగాలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రతిపక్ష వైసీపీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను అన్నింటా విస్మరిస్తున్నారంటూ అధికార యంత్రాంగాన్ని గట్టిగా నిలదీశారు. సభ్యులు కాని వారు ప్రశ్నలు సంధించి ఈచర్చకు మరింత ఆజ్యం పోశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ విక్రాంత్ స్పందిస్తూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే ఊరుకోబోమని, తమ పార్టీ సభ్యులను అగౌరవపరిస్తే ఎంతవరకైనా వెళ్తామని హెచ్చరించారు. విద్య, వైద్యం, వెలుగు, వ్యవసాయం, పంచాయితీరాజ్‌పై వాడీవేడిగా చర్చ జరిగింది. తాటిపాడు, అంబఖండి పాఠశాలల్లో మిడ్‌డేమీల్, స్వచ్ఛదూత్ సిబ్బంది తొలగింపు, వెలుగులో వీఓఏల కార్యవర్గ నియామకంపై సర్పంచ్‌లకు సమాచారం లేకపోవటం చర్చకు దారి తీసింది. బూరాడ రైతుభరోసా ప్రారంభోత్సవానికి కొర్లవలస సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకపోవడంపై వైస్ ఎంపీపీలు టి.అచ్చంనాయుడు, వి.జగన్మోహనరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వారి ప్రతినిధులు స్పందిస్తూ ఇందుకు బాధ్యులైన ఎంఈవో వరప్రసాదరావు, ఏపీఎం గోవిందరావు, ఏవో మురళీకృష్ణలను గట్టిగా నిలదీశారు. పాఠశాలల్లో సిబ్బంది తొలగింపుపై ఎంఈవో సరైన సమాధానం ఇవ్వకపోవడంపై విచారణ కోరుతూ కలెక్టర్‌కు నివేదించాలని తీర్మానం చేశారు. బూరాడ పీహెచ్‌సీ పనితీరు, ఉపాధి శాఖలో కొంతమంది టీఏల పనితీరును సభ్యులు తప్పుపట్టారు. బూరాడ పీహెచ్‌సీ డాక్టర్ చలమయ్య పనితీరు అసలు బాగోలేదని వైస్ ఎంపీపీ వి.జగన్మోహనరావు, కొంతమంది సర్పంచ్‌లు సభలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల సమావేశంలో సభ్యులకు బదులు వారి భర్తలు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పంచాయతీరాజ్, వెలుగు, విద్యాశాఖపై జరిగిన చర్చలో జీవోల ప్రాప్తికి అడిగి ఆ శాఖ అధికారులను వీరు ఉక్కిరిబిక్కిరి చేశారు. దీనిపై అధికారులు నీళ్లు నమిలారు.


బూరాడ పీహెచ్‌సీ సిబ్బందిని నిలదీస్తున్న దృశ్యం

ఏటీఎల్ మారథాన్ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

కలెక్టరేట్: అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్) మారథాన్(2023-24) దేశ వ్యాప్తంగా జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఆల్ ఇండియా టాప్ 500 ప్రాజెక్టులలో ఏపీకి చెందిన 35 ప్రాజెక్టులు ఎంపిక కాగ, జిల్లా నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈవో ప్రేమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు భాను సాయి, జతిన్ తయారు చేసిన ప్రాజెక్టు, పట్టణంలోని పోర్టు సిటి స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎం.నిఖిల్, డి. కార్తికేయ, ఎం.ప్రణయ్ కౌశిక్‌ల ప్రాజెక్టు, భోగాపురం మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు జి.వర్షిత, యశస్విని, అక్షయల ప్రాజెక్టు, రామభద్రపురం జిల్లా పరిషత్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి కె.గౌతం, 9వ తరగతి విద్యార్థి బి.శ్యాం సాయిల ప్రాజెక్టు, దెందేరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పది తరగతి విద్యార్థులు జె.పూజ, గోపి, బాలు నర్సింహులు తయారు చేసిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. విద్యార్థులను డీఈవో ప్రేమకుమార్ అభినందించారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

రాజాం రూరల్: పట్టణంలోని తెలగవీధికి చెందిన బావరాజు వెంకటేష్ తనను కర్ర, రాయితో కొట్టి గాయపరిచాడని ఆదేవీధికి చెందిన శెట్టి శ్రీనివాసరావు శనివారం రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనెల 2న రాత్రి తాను పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో తనపై పాత కక్షతో దాడిచేసినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. శ్రీనివాసరావు రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. రవికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలో మొక్కల పెంపకం

బొబ్బిలిరూరల్: అలజంగి ప్రాథమిక పాఠశాలలో శనివారం కె.కృష్ణదాసు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. హెచ్ఎం మోజెస్, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేష్ఠమైనవి

తెర్లాం, ఆగస్టు 3: పెరుమాళి సెక్టారులో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెరుమాళి, జగన్నాథవలస, కాలంరాజుపేట గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవ ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చిట్టమ్మ మాట్లాడుతూ తల్లిపాలల్లో విటమిన్లు, ప్రోటీన్లు సమపాలలో ఉండడం వల్ల బిడ్డ శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. బిడ్డకు ఆరు నెలలపాటు ప్రతీరోజూ 12సార్లు తల్లిపాలు తాగించాలని, దీనివల్ల జ్ఞాపకశక్తి, చురుకుదనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగ్‌వాడీ సిబ్బంది ఎన్.లక్ష్మి, విజయభారతి, రత్నకుమారి, దమయంతి, సునీత, బాలింతలు పాల్గొన్నారు.

బొబ్బిలి: బొబ్బిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మల్లమ్మపేట, చెరువుగట్టువీధి, చింతాడ, నారసింహునిపేట, గున్నతోటవలస గ్రామాల అంగన్వాడీ కేంద్రాలలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణీలకు ఘనంగా శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు సీహెచ్ అరుణకుమారి, కృష్ణవేణి, వై.రాజు, ఎన్.ప్రభావతి, ఎం.శుభలక్ష్మి పాల్గొన్నారు.

శృంగవరపుకోట రూరల్ /జామి ఆగస్టు 3 : శృంగవరపుకోట మండలం వెంకటరమణపేట, జామి మండలం అలమండలో శనివారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. వెంకటరమణపేట గ్రామంలో నిర్వహించిన ఈ వారోత్సవంలో సూపర్‌వైజర్ సుశీల మట్లాడుతూ తల్లిపాలపై వున్న అపోహలు వీడనాడాలనీ సూచించారు.

కొత్తవలస : వియ్యంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం సీతంపేట, అప్పన్నపాలెం, ఉత్తరాపల్లి గొల్లలపాలెం, దేవాడ గ్రామాలలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు విశిష్ఠ గురించి తెలిపారు.

విజయనగరం రూరల్: పుట్టిన బిడ్డకు తొలి టీకా ముర్రిపాలేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ పరిధిలోని బొత్సపేట రెండో అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్త శ్యామలాదేవి, ఆశావర్కర్ విజయలక్ష్మితో పాటు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.


బొబ్బిలి: మల్లమ్మపేటలో గర్భిణులకు సీమంతం



షెడ్ల పనులు చేపడుతున్న దృశ్యం

చిరు వ్యాపారులకు మంచి రోజులు

● నాబార్డు నిధులతో పక్కా షెడ్లు

గజపతినగరం: ఎన్నో ఏళ్లుగా ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ వస్తున్న చిరు వ్యాపారుల చిరకాల కోరిక ఇన్నాళ్లకు నెరవేరుతోంది. గజపతినగరం పంచాయతీ పరిధిలో గల కూరగాయల మార్కెట్ 40 ఏళ్లుగా నడుస్తోంది. సుమారు 50 మంది వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు వ్యాపారాలు సాగిస్తున్నారు. పంచాయతీకి రోజు వారీ ఆశీలు చెల్లిస్తున్నారు. కానీ పంచాయతీ మౌలిక సదుపాయాలు కల్పించ పోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే తాటాకుల షెడ్లు కారిపోయి కూరగాయలు తడిసిపోవడంతో నష్టాల బారిన పడేవారు. గత ప్రభుత్వం హయాంలో పక్కా షెడ్లు నిర్మిస్తామని చెప్పిన వైసీపీ నాయకుల మాటలు నీటి మూటలయ్యాయి. ఆ తరువాత ఎన్నికల కోడ్‌కు ఒక్కరోజు ముందు హడావిడిగా శంకుస్థాపన చేశారు. షెడ్ల నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.15లక్షలు, గ్రామ పంచాయతీ నుంచి రూ.5 లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిరు వ్యాపారులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వద్ద తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. మంత్రి చొరవతో గ్రామ పంచాయితీకి సంబంధించిన 32 సెంట్ల స్థలంలో 20 సెంట్లు చిరు వ్యాపారుల షెడ్లకు కేటాయించారు. గతంలో 25 మంది వ్యాపారులు ఉన్నారు. కొత్తగా 15మందికి అవకాశం కల్పించే దిశగా 40 షెడ్లు నిర్మిస్తున్నారు. అక్టోబర్ నాటికి పనులు పూర్తిగా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

అక్టోబరులోగా అందజేస్తాం

చిరు వ్యాపారులకు షెడ్లు అందించాలన్న లక్ష్యంతో పనులు వేగవంతంగా సాగుతున్నాయని గజపతినగరం ఈవో మంత్రి రమణ తెలిపారు. వర్షాలు తెరిపిస్తే అక్టోబరులోగా వ్యాపారులకు అందజేస్తామని చెప్పారు.



కాలనీలో సర్వే చేస్తున్న రెవెన్యూ, సర్వే సిబ్బంది

నరవలో ఇళ్ల స్థలాల పరిశీలన

గంట్యాడ: మండలంలోని నరవలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలు, నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు శనివారం పరిశీలించారు. కాలనీలోని కొంతమంది అనధికారికంగా పట్టాలు లేకుండా పునాదులు నిర్మించుకున్నారని ఇటీవల జరిగిన గ్రామ సందర్శనలో కొందరు మండల నోడల్ అధికారికి ఫిర్యాదుచేసిన విషయం విదితమే. దీంతో ఆ లేఅవుట్‌లో అక్రమాలపై విచారణ చేయాలని నోడల్ అధికారి కోరారు. దీనిపై పరిశీలించాలని తహసీల్దార్‌కు సూచించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ కార్యదర్శులు, సర్వేయర్లు లేఅవుట్‌కు వెళ్లి పరిశీలించారు. ఈ లేవుట్‌లో 180 ప్లాటు వేయగా, ఇందులో 142 మంది లబ్ధిదారులకు అప్పట్లో పట్టాలు మంజూరు చేశారు. అయితే ఖాళీగా ఉన్న స్థలాల్లో పట్టాలు లేకుండా కొందరు పునాదులు నిర్మించికున్నట్లు అధికారులు పరిశీలనలో గుర్తించారు. ఎంతమంది నిర్మించుకున్నారు అనేది ఇంకా తెలియాల్సి ఉందని గ్రామ రెవెన్యూ కార్యదర్శి శేఖర్ తెలిపారు. నివేదికను తహసీల్దార్‌కు అందజేస్తామని చెప్పారు. పట్టాలు లేకుండా పునాదులు నిర్మించుకున్న వారికి తహసీల్దార్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలోని గ్రామ కార్యదర్శులతో పాటు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న నాయకులు

రైతులకు ఎరువుల పంపిణీ

దత్తిరాజేరు: మండలంలోని గడసాం రైతు సేవా కేంద్రం వద్ద ఏవో అనూరాధ రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మండల మోహన్, గడసాం, ఎం.లింగాలవలస టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



గజపతినగరంలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

వరద బాధితుల కోసం విరాళాలు

గజపతినగరం: కేరళ రాష్ట్రం వయనాడులో వరద బాధితుల సహాయ నిధి కోరుతూ శనివారం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి ఆధ్వర్యంలో గజపతినగరంలో వ్యాపారుల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తక్షణ సాయం అందజేయాల్సిన కేంద్ర ప్రభుత్వం కుంటిసాకులు చెప్పడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీను, నాయకులు హరి, కృష్ణవేణి, రాము, లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలే మొదటి టీకా

బొండపల్లి: నవజాత శిశువులకు ముర్రుపాలే తొలి టీకాగా పని చేస్తాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ సూచించారు. శనివారం గరుడబిల్లి గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు బాషా, ఎంఎల్‌హెచ్‌పీ బి.విశ్వేశ్వరరావు, ఏఎన్‌ఎం అంజమ్మ, బి.రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పర్యవేక్షణ లేక.. ఎరువులు దొరక్క

● ఆందోళన చెందుతున్న అన్నదాతలు
● ఇదీ వంగర మండలంలోని ఆర్బీకేల్లో పరిస్థితి

వంగర: వంగర మండలంలో ఎరువులకోసం రైతులు అగచాట్లకు గురవుతున్నారు. ప్రధానంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎరువులు దొరకడంలేదని రైతులు వాపోతున్నారు. ఆర్బీకేల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు డీలర్లపై ఆధారపడాల్సివస్తోంది. గత పదిరోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో కొన్ని చోట్ల నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. నదులు, కాలువలకు ఆనుకుని ఇప్పటికే నాట్లు పూర్తిచేశారు.

ముమ్మరంగా నాట్లు..

ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీనికితోడు నాగావళి, మద్దువలస, తోటపల్లి, ఎస్ఎస్ చానళ్ల పరిధిలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం నాట్లు వేసిన తర్వాత, నారు తీత ముందు ఎరువుల చాలా అవసరం. అయితే ఆర్బీకేల్లో దొరక్కపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. దీంతో కొందరు అధనంగా ధర చెల్లించి ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించి బస్తాపై రూ.30 నుంచి 40 వరకు అధనంగా వసూలుచేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

ఐదువేల ఎకరాల్లో సాగు..

ఖరీఫ్‌లో ఈ ఏడాది వంగర మండలంలో సుమారు ఐదు వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే రెండువేల ఎకరాల్లో వరి ఎదలు, ఉడుపులు పూర్తయ్యాయి. మిగతాచోట పొలాలు దమ్ముచేసి నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉంచారు. వరి నారుమడులు వేసిన నుంచి రైతులు పంట చివరిదశ వరకు అధిక దిగుబడి సాధించాలన్న లక్ష్యంతో రసాయన ఎరువులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఈ ఏడాది పచ్చి రొట్ట ఎరువుల కోసం 1800 ఎకరాల్లో జీలుగ, పిల్లిపెసర వంటి విత్తనాలు చల్లారు. ప్రధానంగా పచ్చిరొట్ట వేసిన పొలాలు దమ్ముచేసిన తర్వాత అవి కుళ్లడానికి సూపర్‌ఫాస్ఫేట్‌తో పాటు యూరియా, డీఏపీ, పోటాష్ ఎక్కువగా వినియోగిస్తారు. ఈ తరుణంలో ఇక్కడి రైతులకు ఎరువులు ఆర్బీకేల్లో దొరక్క ఇబ్బందిపడుతున్నారు. మండలంలో 19 రైతు భరోసాకేంద్రాలు ఉన్నా ఏ ఒక్క చోట రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులోలేవని పలువురు వాపోతున్నారు. ప్రధానం ఇక్కడ వరితో పాటు వాణిజ్య పంటలు, కూరగాయలు సాగుచేస్తున్నారు. అందుకు ఎరువులు అవసరమైనా అందుబాటులో ఉంచడంలేదని రైతులు చెబుతున్నారు. దీంతో ప్రైవేటు వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. పైగా కొనుగోలు చేసిన వారికి రశీదు కూడా ఇవ్వడంలేదు. అయినా వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలొస్తున్నాయి.



మగ్గూరులో నాట్లు వేస్తున్న దశ్యం

ఆర్బీకేల్లో అందేలా చర్యలు

ఆర్బీకేల్లో రైతులకు ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని వంగర ఏవో కన్నబాబు తెలిపారు. ఇప్పటికే కొన్ని కేంద్రాల్లో యూరియా అందజేశామని చెప్పారు. దుకాణాల్లో తనిఖీ విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తెలిపారు. విజిలెన్స్ తనిఖీ నిర్వహించి అక్రమాలు బయటపడితే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతి రూపాయీ కక్కిస్తా

● ప్రభుత్వ నిధులతో ఇష్టారాజ్యమా?
● మంత్రి ప్రశ్నలకు నీళ్లు నమిలిన ఇరిగేషన్ అధికారులు
● రూ.14 కోట్ల పనులపై సమగ్ర విచారణ
● మంత్రి సంధ్యారాణి ఆదేశం

మెంటాడ: రైతుల కోసం మంజూరు చేసిన నిధులను వైసీపీ నేతలు, అధికారులు దిగమింగారని... తిన్న ప్రతి రూపాయినీ కక్కిస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హెచ్చరించారు. ఆంధ్ర రిజర్వాయర్ ఆధునికీకరణకు గతంలో విడుదలైన రూ.14 కోట్ల జైకా నిధుల వినియోగంపై వచ్చిన ఆరోపణలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. వీటి నిగ్గు తేల్చాలని ఇరి గేషన్ అధికారులను ఆదేశించారు. మూడు రోజుల్లో పనుల వివరాలతో తనకు నివేదిక అందించాలని స్పష్టం చేశారు. శనివారం ఆంధ్ర నీరు విడుదల సందర్భంగా రైతులు పలు సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. నిధులు దారి మళ్లాయని, పనులు ఎక్కడివక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. రిజర్వాయర్ నీరు వృథా అవుతోందని తెలిపారు. గేట్ల ద్వారా నీరు లీకవుతోందని.. కాలువలలో పూడికలతో సాగునీరు శివారు ఆయకట్టుకు వెళ్లడం లేదని చెప్పారు. దీనిపై స్పందించిన మంత్రి.. చేపట్టిన పనుల వివరాలు చదివి వినిపించాలని ఇరిగేషన్ ఈఈ, డీఈఈని ఆదేశించారు. కాలువలపై మదుములు, బ్రిడ్జిలు నిర్మించామని అధికారులు చెబుతుండగా రైతులు అడ్డు తగిలారు. ఆ పనులేవీ జరగలేదని ఆరోపించారు. అధికారులు వెంటనే సర్దుకొని రిపేర్లు చేశామని మాట మార్చడంపై మంత్రి మండిపడ్డారు. రిపేర్లు చేశారా? కొత్తవి నిర్మించారా చెప్పాలని మంత్రి అనడంతో ఇరిగేషన్ అధికారులు నీళ్లు నమిలారు. చేసినవి చెప్పలేక పోతున్నారంటే అభి వృద్ధి పనులు ఏ మేరకు జరిగాయో అర్థమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నివేదికలు అందిన తర్వాత తదుపరి చర్యల కోసం వాటిని జల వనరుల మంత్రి దృష్టిలో పెడతామని తెలిపారు. శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తామని, పనులు సక్రమంగా పూర్తయ్యేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు.

● **సమస్యలపై వినతులు**

రహదారులు బాగు చేయాలని, మత్స్యకార సంఘాలను ఆదుకోవాలని పలువురు మంత్రికి వినతిపత్రాలు అందించారు. ఆంధ్ర పంచాయతీలో నిధులు పక్కదారి పట్టాయని స్థానికులు చెప్పగా.. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎంపీడీవోను మంత్రి ఆదేశించారు. పెదచామలాపల్లిలో నిధుల అవకతవకల విషయం తేలినప్పటికీ చర్యలు లేవని మరికొందరు తెలిపారు. రికార్డులు తన ఆధీనంలో ఉన్నాయని పంచాయతీ విస్తరణాధికారి బదులిచ్చారు. గిరిజనుల పోడు భూములకు సాగుపట్టాలు ఇవ్వాలని, జైకా నిధుల వినియోగంపై విచారణ చేపట్టాలని సీపీఎం నాయకులు ఆర్.రాములు వినతిపత్రం అందజేశారు.

గరివిడిలో రక్తదాన శిబిరం

గరివిడి: గరివిడి పశువైద్య కళాశాలలో కళాశాల డీఎం శ్రీను ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో శనివారం జరిగిన రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

భోగాపురం: మండలంలోని వివిధ వర్గాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని జనసేన నాయకులు శనివారం తహసీల్దారు ఎం.సురేష్‌కు విజ్ఞప్తి చేశారు. భూములు ఆన్‌లైన్ చేయడం లేదని, పేదలకు ఇంటి స్థలాలు లేవని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎం.అప్పలకొండ మాట్లాడుతూ ముక్కాం సముద్ర తీరంలో అనేక ఆక్రమణలు ఉన్నాయని, నల్ల ఇసుకను రాత్రి సమయాల్లో తరలించుకుపోతున్నారని వివరించారు. దీనిపై తహసీల్దార్ ఎం.సురేష్ మాట్లాడుతూ అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కోఆర్డినేటర్ పల్ల రాంబాబు, క్లస్టర్ ఇన్‌చార్జులు పల్లంట జగదీష్, శిరుగుడి వెంకటేష్, పి.జోగారావు, గోపిశెట్టి పవన్, నాయకులు గుండపు సూర్యారావు, జగ్గపు రవి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ అధ్యక్షుడిగా వీరన్నదొర

నెల్లిమర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నెల్లిమర్ల తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా పి.వీరన్నదొర మరోసారి ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఈ ఎన్నికలు జరిగాయి. సంఘ కార్యదర్శిగా తాడుతూరి శివప్రసాద్, సహాధ్యక్షులుగా డాక్టర్ జి.చక్రవర్తి, కోశాధికారిగా ఎం.మురళీమోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి.వెంకటరావు, ఉపాధ్యక్షులుగా కె.విజయలక్ష్మి, బి.ఉమ, జి.పద్మగౌరి, జె.వేణుబాబు, జేవీ లీల, సంయుక్త కార్యదర్శులుగా బి.ఎ.వెంకటేశ్వరరావు, ఎం.చిన్నారావు, కె.శ్యామ్‌కుమార్ యాదవ్, సౌజన్య, జి.కృష్ణవేణి ఎన్నికయ్యారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

నెల్లిమర్ల: పారసాం గ్రామంలో శనివారం సాయంత్రం సంగంరెడ్డి జగదీష్ మెమోరియల్ జిల్లా స్థాయి డే అండ్ నైట్ వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సర్పంచ్ గొలజాన నారాయణరావు, ఎంపీటీసీ సంగంరెడ్డి జగన్నాథం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దివంగత జగదీష్ కుటుంబీకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

దత్తిరాజేరు: గుచ్చిమి గ్రామంలో వైసీపీ కార్యకర్త, వరుసకు సోదరుడైన కడుబండి ప్రసాద్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. ప్రసాద్ మృతికి గల కారణాలను వదిన లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైసీపీ జిల్లా కమిటీ సభ్యులు కడుబండి రమేష్‌నాయుడు, విందువాసి సర్పంచ్ రంభ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతో ఆలయ నిర్మాణం

● ధర్మశాస్తా ట్రస్టు ప్రతినిధులు

చీపురుపల్లి: చీపురుపల్లిలో తలపెట్టిన అయ్యప్ప ఆలయాన్ని దాతల సహకారంతోనే నిర్మిస్తున్నామని ధర్మశాస్తా ట్రస్ట్ ప్రతినిధులు కె. శ్రీనివాసకుమార్, ఎస్. సన్యాసిరావు, ఎస్వీజీ శ్రీనివాసరావు, అప్పికొండ ఆదిబాబు, దిలీప్‌కుమార్ ధనూకా, దాసరి రవి తదితరులు స్పష్టం చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి రూ.3.5 కోట్లు వ్యయం కానున్నట్టు అంచనాలు రూపొందించామన్నారు. ఏక శిలతో 18 మెట్లు తయారు చేయనున్నట్టు వెల్లడించారు. ట్రస్ట్ సభ్యుడు గంట్యాడ విష్ణుమూర్తి ఆలయ నిర్మాణం కోసం 50 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో కె.శ్రీనివాసకుమార్, బెల్లాల శ్రీనివాసరావు, గొల్లస్వామి, గుడ్ల శ్రీను, పుండరి, రెడ్డి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిరోధం అందరి బాధ్యత

● ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ప్రేమలత



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ ప్రేమలత

చీపురుపలి: మత్తు పదార్థాలను నిరోధించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని చీపురుపల్లి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వై.ప్రేమలత అన్నారు. స్థానిక ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం మాదక ద్రవ్యాల నిరోధంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాదక ద్రవ్యాలు తీసుకున్న వారు బాధితులవుతారని, తయారీ, విక్రయం, రవాణా, ఉత్పత్తి తదితర అంశాల్లో భాగస్వాములైన వారు నేరస్తులవుతారన్నారు. విద్యార్థులు వాటి జోలికి వెళ్లకుండా మంచి భవిష్యత్తు కోసం బాటలు వేసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్.నాగభూషణరావు, దాసరి రఘుపతినాయుడు, కె. కిరణ్, జగదీష్, లక్ష్మణరావు, ఎస్ఐ కె.కిరణ్ కుమార్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి

చీపురుపల్లి: జాతీయ స్థాయిలో జరిగిన అందాల పోటీల్లో ద్వితీయ స్థానం పొందిన వెలిచేటి రమాచౌదరి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు ఆకాంక్షించారు. శనివారం ఆయన నివాసంలో కలిసిన మిసెస్ ఇండియా రమాచౌదరిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పుట్టి, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న రమా చౌదరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విజేత రమా చౌదరి మాట్లాడుతూ.. ఇప్పటికే ఏడు సినిమాల్లో నటించానన్నారు.

బ్యాంకర్ల సహకారంతోనే మహిళల ఆర్థికాభివృద్ధి

చీపురుపల్లి: బ్యాంకర్ల సహకారంతోనే డ్వాక్రా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని డీఆర్‌డీఏ ఏపీడీ కె. సావిత్రి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన జేఎంఎల్‌బీసీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు నడిపే యూనిట్లకు అవసరమైన మేరకు రుణ సాయం అందజేయాలని బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. వారి ఆర్థికాభివృద్ధికి సహకరించాలని కోరారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ వీవీ రమణమూర్తి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



సీతారాముల ఉత్సవ మూర్తులను పుష్పాలతో అలంకరించిన దృశ్యం

ఘనంగా పునర్వసు పట్టాభిషేకం

నెల్లిమర్ల: రామతీర్థం దేవస్థానంలో శ్రీరాముడి జన్మనక్షత్రం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ప్రాతఃకాలార్చన, బాలభోగం, అనంతరం యాగశాలలో సుందరకాండ హవనం నిర్వహించి ఉత్సవమూర్తుల వద్ద నిత్య కల్యాణం నిర్వహించారు. గత నెల 6 నుంచి ఈ నెల 3(పునర్వసు నక్షత్రం) వరకు దేవాలయంలో శ్రీమద్రామాయణ పారాయణం నిర్వహించి ఆస్థాన మండపంలో ఉత్సవ మూర్తుల వద్ద పట్టాభిషేక సర్గ వినిపించారు. స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో అధికారుల పరిశీలన



కొండ్రాజుపాలెం తీరంలో నల్ల ఇసుక తరలింపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భోగాపురం: సముద్ర తీరంలో నల్ల ఇసుక అక్రమంగా తరలిపోతున్న వైనంపై 'తీరంలో దొంగలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం వెలువడింది. దీనికి స్పందించిన తహసీల్దారు ఎం.సురేష్, సీఐ ఎ.రవి కుమార్, రెవెన్యూ, పోలీసు బృందాలతో శనివారం సముద్ర తీరంలో పర్యటించారు. నల్ల ఇసుక తరలిపోతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఎర్రముసలయ్యపాలెం, ముక్కాం, కొండ్రాజుపాలెం గ్రామాల పరిధిలోని సముద్ర తీరంలో పర్యటించారు. నల్ల ఇసుక పోగులు గుర్తించారు. ఎర్రముసలయ్య పాలెంలో స్థానికులను విచారించగా నల్ల ఇసుక తరలిపోవడం వాస్తవమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎం.సురేష్, సీఐ ఎ.రవికుమార్ పాల్గొన్నారు. దీనిపై జిల్లా అధికారులకు నివేదిక అందజేయనున్నట్లు వెల్లడించారు.

నెల్లిమర్ల-రణస్థలం రోడ్డుకు మరమ్మతులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల-రణస్థలం ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టినట్లు ఈ శాఖ విజయనగరం డివిజన్ ఈఈ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోడ్డు దుస్థితిపై గత నెల 25న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. ప్రమాదాలు జరగకుండా గోతులను సరిచేశామని, అవసరమైన చోట కాంక్రీట్ చిప్స్‌తో మరమ్మతులు చేపట్టామని తెలిపారు. సుమారు రూ.14 కోట్లతో మంజూరైన రోడ్డు పనులను కాంట్రాక్టర్ 2021 డిసెంబరులో ప్రారంభించారని తెలిపారు. అయితే రూ.4.17 కోట్ల మేర బిల్లులు చెల్లించకపోవడంతో ఆయన పనులు నిలిపివేశారని పేర్కొన్నారు. పనులను పునఃప్రారంభించాల్సిందిగా సదరు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు.